విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 20 జనవరి 2025 8 పేజీలు

గతం ఎంతో ఘనం... నేడు శూన్యం...!

ఉపాధి అంటే ప్రభుత్వ కొలువే కాదు..రవాణారంగం లక్షలాది కుటుంబాలను పోషిస్తుంది. అయితే వివిధ కారణాల వలన ప్రస్తుతం రవాణా రంగం పతనం దిశగా పయనిస్తోంది. ఎప్పటినుంచో ఈ రంగంలో ఉన్నవారు వ్యాపారం కొనసాగించలేక.. లారీలు అమ్మలేక సతమతమైపోతున్నారు. మరికొందరు లారీ యజమానులు తమ వాహనాలను అమ్ముకొని ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు.పెరిగిన డీజిల్ ధరలు.. ప్రభుత్వ ప్రోత్సాహం ఏమాత్రం లేకపోవడం లారీ రవాణా రంగాన్ని కుంగతీస్తోంది. ఎంతోమందికి ఉపాధి కల్పించిన రవాణారంగం గతం ఎంతో ఘనం...నేడు శూన్యం అన్నట్లుగా ఉంది.

- గిట్టుబాటు కాని లారీల రవాణా...
- పెరిగిన డీజిల్ ధరలు
- ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే....

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లారీలు కలిగి ఉన్న వారికి స్థితిమతులన్న పేరు.. గౌరవం ఉండేవి. అయితే కాలక్రమంలో పరిస్థితులలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. నాడు సగౌరవంగా లారీలు నడుపుకున్న యజమానులు నేడు విధిలేని పరిస్థితులలో ఆ వ్యాపారానికి స్వస్తి చెప్పడమో..లేదంటే స్వయంగా డ్రైవర్లుగా మారిపోవడమో చేస్తున్నారు.ఒక వెలుగు వెలిగిన రవాణా రంగం నేడు అధః పాతాళానికి దిగజారింది.ఒకప్పుడు కిరాయికి లారీ దొరకాలంటే కష్టం.నేడు యార్డు నుంచి లారీ కదలాలంటే కష్టం.ఇది పరిస్థితి.వెలుగులు విరచిమ్మిన రవాణా రంగం దుస్థితికి ఎన్నో కారణాలు ఉన్నాయి. డీజిల్ ధరలు పెరగడం. నిర్వహణ ఖర్చులు ఎక్కువ కావడంతో పాటు..ప్రభుత్వం వసూలు చేసే ఫీజులు, టోల్ గేట్లు పెరగడం కూడా కారణాలే. దీంతో పాటు పలువురు యువత చదువుకుని వేరే రంగాలలో ఉపాధిని వెతుక్కుంటున్నారు.వాహనాలు నడిపే వారికి డిమాండ్ పెరగడంతో ఆ ఖర్చులు తడిసి మోపిడై నేడు లారీల యజమానుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. రవాణా రంగాన్ని ఒకప్పుడు లారీలే

▶మిగతా 2లో..

అమిత్‌షాను అరెస్టు చేయాలి

వామపక్ష నాయకుల ఆందోళనలు

విశాలాంధ్ర - భీమవరం : అంబేద్కర్‌ని అవమానపర్చిన అమిత్‌షాకు రాష్ట్రంలో అడుగు పెట్టే హక్కులేదని, అమిత్‌షాను అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌విగోపాలన్, ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి నిప్పులు చెరిగారు. ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద అమిత్ షా గో బ్యాక్ అనే నినాదంతో ఆందోళ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన హెూంమంత్రి అమిత్‌షా రాజ్యాంగం రూపకర్త అంబేద్కర్‌ని హేళన చేసి మాట్లాడటం అంతకంటే దుర్మార్గమైన చర్యని విమర్శించారు. అమిత్‌షాను ప్రధాన మంత్రి తన మంత్రి వర్గం నుండి బర్తరప్ చేయాలని, పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి ఆనంద్, ఎంసీపీఐ నాయకులు కె.మహంకాళి, చంటి, దళిత ఐక్య వేదిక గంటా సుందర్ కుమార్, ఏపీ బహుజన జేఏసీ నాయకులు బిరుదుగడ్డ రమేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, బాతిరెడ్డి జార్జి, పుల్లారేడ్డి, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వర రావు, పార్వర్డ్ బ్లాక్ నాయకులు దుండు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు

రూ.3.78 కోట్ల నిధులు మంజూరు

కలెక్టరు ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.378.05 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 24 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌక్యరం, మౌలిక సదుపాయాలు కల్పించుటకు చర్యలు తీసుకోంటున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నిధులతో పైకప్పు మరమ్మతులు, ఫ్లోరింగ్ మరమ్మతులు, తాగు నీరు, మరుగు దోడ్లు, కరెంటు పనులు, తలుపులకు , కిటికిలకు దొమలు నివారణకు మేష్ లు, బాలికల వసతి గృహాములకు ప్రహారి గోడ నిర్మణాము పనులు, తక్షణ అవసర మరమ్మతులు చేపట్టనున్నట్లు కలక్టర్ తెలియ చేశారు. గోపాలపురం నియోజక వర్గ పరిధిలోని 10 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాములకు రూ.144.84 లక్షలు , రాజమహేంద్రవరం సిటీ నియోజక వర్గ పరిధిలోని 6 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాములు రూ.70.01 లక్షలు

రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ పరిధిలోని 2 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహములులకు రూ.32.51 లక్షలు, జగ్గంపేట నియోజక వర్గ పరిధిలోని గోకవరం మండలంలోని ఒక ప్రభుత్వ సంక్షేమ వసతి గృహామునకు రూ.17.05 లక్షలు, రాజానగరం నియోజక వర్గ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాము రూ.11.05 లు, పెద్దాపురం నియోజక వర్గ పరిధిలోని రంగంపేటలోని 1 సంక్షేమ వసతి

▶మిగతా 2లో

అత్యవసర పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టవలసిన అత్యవసర పనుల అంచనాల ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం స్ధానిక సర్వజన ఆసుపత్రి(జిజిహెచ్)ను

▶మిగతా 2లో

క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -నరసాపురం : నరసాపురం రుస్తుంబాదలో శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొత్తపల్లి సోదరుల సారధ్యంలో ఐదు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అద్నాన్ నయీం అస్మి ముఖ్య అతిథిలుగా పాల్గొని ఆహ్లాదముగా క్రీడలను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో యువత చెడు అలవాట్లకు మరలకుండా 35 సంవత్సరాలుగా శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ, కొత్తపల్లి సోదరులు సారధ్యంలో దేశంలో పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులను తీసుకువచ్చి సాంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ జాతీయస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. కబడ్డీ గ్రామీణ క్రీడగా అందరికీ హృదయానికి దగ్గరైన

ఆట అన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. నరసాపురంలో కబడ్డీ కోసం ఇంత గొప్ప స్టేడియం ఉండడం గొప్ప విషయమని అన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు కూర్చుని చక్కగా క్రీడలను వీక్షించడం చాలా సంతోషం అనిపించిందన్నారు. నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశానన్నారు. క్రీడలను ఆడటం చాలా ముఖ్యం. గెలిచామా, ఓడామా అనేది పక్కన పెడితే ధైర్యముగా క్రీడకు సన్నిద్ధమై ముందుకు వచ్చి వేలమంది ముందు ఆడటం గొప్ప విషయమని

▶మిగతా 2లో

దాతలు ముందుకు రావాలి
జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - భీమవరం : పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సం బంధించిన డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని బస్సు షెల్టర్లు, పార్కులు నిర్మాణ పర్యవేక్షణలో భాగంగా జాయింట్ కలెక్టర్ ఆదివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ సంద ర్భంగా ఆయన ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బస్ షెల్టర్, ఆర్టీసీ డిపో వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీ లించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్క్ ను పరిశీలించారు. ప్రభు త్వంతో పాటు దాతలు ముందుకు రావాలని జేసి కోరారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, ఎంఆ త్రినాధ్, ఆర్టీసి డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, కంతేటి వెంకటరాజు, జానపాటి మధు సుదన్ రావు, రంగసాయి, దిలీప్, సి హెచ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరణ పొడిగింపు...

విశాలాంధ్ర - నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి ఈనెల 10వ తేదీన ప్రకటన జారీచేయడం జరిగిందని, సదరు దరఖాస్తు స్వీకరణకు తుది గడువును ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు సాయంత్రం గం.5వరకు పొడిగించినట్టు నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 22 వ తేదీ సాయంత్రం గం. 5లోగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం, సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయాలు, తమ దగ్గరలోని గ్రామ,వార్డ్ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ స్మరణ్ తెలియజేసారు.

పాలడుగుకు ఘన నివాళులు

విశాలాంధ్ర- నూజివీడుటౌను : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలడుగు వెంకట్రావు పదవ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు పాలడుగు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరిమి సాగర కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో నియోజకవర్గ ఇన్చార్జి మరీదు కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు బిడి రవికుమార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు పాలడుగు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ పాలడుగు నాగవరత్, ముసునూరు, నూజివీడు టౌన్, రూరల్ మండల అధ్యక్షులు సూర్యదేవర ప్రసాదు, యార్లగడ్డ ఆంజనేయులు, పల్లె పాము ప్రసాదు, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు రాము, ప్రసాదరావు, టిడిపి నాయకులు అక్కినేని చందు, మాజీ పీసీసీ సభ్యులు టి ఆర్ బి విటల్ కుమార్, పూర్ణచంద్రరావు, ఆచార్యులు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొందిలి రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శూన్యం
(మొదటి పేజీ తరువాయి)

నేడు శూన్యం శాసించేవి.అయితే ప్రస్తుతం వివిధ రకాల రవాణా వాహనాలు అందుబాటు లోకి రావడం కూడా లారీల రంగం పతనాన్ని శాసిస్తున్నాయి.

డీజిల్ ధరల పెంపు...

ఒకప్పుడు పెట్రోల్‌కు, డీజిల్‌కు ఎంతో తేడా ఉండేది. పెట్రోల్ ధర రూ.70 ఉన్నప్పుడు.. డీజిల్ ధర రూ.35 ఉన్న సందర్భాలు ఉన్నాయి.ప్రస్తుతం పెట్రోల్ కు, డీజిల్ ధరకు తేడా రూ.10 మాత్రమే. రవాణా రంగం అత్యధి కంగా వినియోగిస్తున్న డీజిల్ పై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం విపరీతంగా ధరలు పెంచడం, తద్వారా రవా ణా చార్జీల పెంపు తప్పనిసరి కావడంతో కిరాయిలు తగ్గిపోతున్నాయి. రోడ్లపైకి నూతన, సౌలభ్యం కలిగిన పెట్రోల్ వాహనాలు వస్తున్నాయి. ఏలూరు నుంచి విజయవాడకు.. లేదా విశాఖపట్నంకి సామాను పంపా లంటే ఒకప్పుడు లారీలే శరణ్యం. ప్రస్తుతం పెట్రోల్ తో నడిచే వాహనాలు అందుబాటులో ఉన్నాయి.కిరాయిలు కూడా తక్కువగా వస్తుండడంతో పలువురు ఇతర వాహనాల వైపు మొగ్గు చూపుతూ లారీలను పట్టించుకోవడం లేదు.

పెరిగిన నిర్వహణ ఖర్చులు...

గతంలో లారీల నిర్వహణ అంత కష్టంగా ఉండేది కాదు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా రంగం మీద ఆధారపడి సుమారు 4500 లారీలు ఉన్నాయి.ఏలూరు నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తాకు చేపలు,బియ్యం, తదితర వస్తువులు లారీ లోడ్ చేసుకొని తీసుకువెళ్లడానికి ప్రస్తుతం రూ.85 వేల నుండి రూ 90 వేలు కిరాయి వసూలు చేస్తున్నారు. అటు నుండి తిరుగు ప్రయాణంలో రూ.30 వేల నుండి రూ.35 వేలు ఏలూరు పరిసర ప్రాంతాలకు లోడు దొరుకుతుంది. దానికి కిరాయి మొత్తంగా రూ.35 వేలు. ఏలూరు నుండి కలకత్తాకు వెళ్లి వచ్చేటప్పుడు ఒక లారీకి డీజిల్,టోల్ గేట్లు, ఇతర ఖర్చులు పోను రూ.90 నుండి రూ.95 వేలు ఖర్చు అవుతుంది. దీంతోపాటు అదనంగా పోలీసు మామూలు రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని లారీ యజమానులు చెబుతున్నారు. లారీ ఎటువంటి మరమ్మతులు రాకుండా ఉంటే యజమానికి రూ.15 వేల నుండి రూ.20 వేలు మిగులుతుంది. లేనిపక్షంలో అదనంగా అప్పు మిగులుతుంది. 15, 20 సంవత్సరాలకు పూర్వం 6 టైర్ల లారీ 10 టన్నుల లోడుతో బెంగాల్ రాష్ట్రం వెళ్లి వస్తే రూ.10 నుండి రూ.20 వేలు మిగిలేవి. ఇప్పుడు అంతా బాగున్నా పెరిగిన డీజిల్, టోల్ గేట్లు తదితర ఖర్చులు పోను ఆ డబ్బులు మిగలడం కూడా కష్టమే. ప్రస్తుతం 10 టైర్ల లారీ 20 టన్నుల లోడుతో బెంగాల్ వెళ్లి వస్తే రూ.25 వేలు,12 టైర్ల లారీ 25 కన్నుల లోడుతో బెంగాల్ వెళ్లి వస్తే రూ.30 వేలు కూడా మిగలడం కష్టమవుతుందని లారీ యజమానులు వాపోతున్నారు. లారీ రవాణా రంగానికి అలవాటు పడి లారీలను అతి కష్టం మీద తిప్పడమే తప్ప ప్రస్తుతం ఈ వ్యాపారం చేయడం చాలా నష్టం కలిగించే విధంగా ఉందని లారీ యజమానులువేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగంపై కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపి ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

నిధులు మంజూరు
(మొదటి పేజీ తరువాయి)

గృహము రూ.11.29 లక్షలు, కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని 2 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహములకు రూ.52.53 లక్షలు , నిడదవోలు నియోజక వర్గ పరిధిలోని 3 ప్రభుత్వ వసతి గృహములకు రూ.38.32 లక్షలు. వసతి గృహము పనులు పర్యవేక్షించుటకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ , ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలకు పై పనులు నిర్వహణ బాధ్యతను అప్పగించామన్నారు. పై పనులను 2025 మార్చి మొదటి వారం లోగా పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యం నిర్దేశించినట్లు కలెక్టర్ తెలియచేశారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించారు. ఈ సందర్భంగా మాతాశిశు సంరక్షణ భవనం ప్రవేశ మార్గం వద్ద వీల్ చైర్స్ సుళువుగా వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటుకు, ఆసుపత్రి చుట్టూ ఉన్న డ్రైయిన్ల ద్వారా మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన డ్రైయినేజీ వ్యవస్థ మెరుగు పర్చేందుకు అవసరమైన అంచనాలతో కూడిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ఆసుపత్రుల ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు సమన్వయం చేసుకొని సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తొలిగా అత్యవసర పనుల ప్రాతిపదికగా విడి విడిగా అంచనాల ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎంఎం రాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, నగరపాలక సంస్థ ఇఇ జి. సురేంద్రబాబు, తహశీల్దారు జివి శేషగిరి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం
(మొదటి పేజీ తరువాయి)

క్రీడలతో మానసిక ఉల్లాసం అన్నారు. జీవితంలో గెలుపునకు క్రీడలు దోహదపడతాయన్నారు. పిల్లలను చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా యువత మెరుగైన అవకాశాలని అందిపుచ్చుకోవచ్చు అన్నారు. గ్రామీణ క్రీడలు అంతరించిపోకుండా ఇటువంటి కమిటీలు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. యువతకు క్రీడలపై మక్కువ పెంచడం ద్వారా చెడు వ్యసనాలకు దూరం చేయవచ్చు అన్నారు.మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుండి అనేకమంది ఇక్కడకు వస్తూ ఉంటారు వారందరికీ ఆహ్లాదకరంగా ఉండేందుకు శ్రీ గోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న కబాడీ పోటీలు ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. అనంతరం స్త్రీ, పురుషుల జాతీయస్థాయి కబాడీ పోటీల్లో గెలుపొందిన పురుషుల విభాగంలో మహారాష్ట్ర ప్రథమ స్థానం, కొలకత్తా ద్వితీయ స్థానం, సి ఆర్ పి ఎఫ్ ఢిల్లీ తృతీయ స్థానం, కోలకత్తా పోలీస్ నాలుగో స్థానం గెలిచాయి, మహిళా విభాగంలో సి ఆర్ పి ఎఫ్ ఢిల్లీ మొదటి స్థానం, రాజస్థాన్ రెండో స్థానం, కోలకత్తా కేరళ జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఆయా జట్లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్ పి అద్నాన్ నయీం అస్మి బహుమతి ప్రదానం చేశారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ డా .డి శ్రీ వేద, తాహసిల్దార్ టి.రాజరాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు, శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల అసోసియేషన్ ఎన్నిక...

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రభుత్వ కళాశాల గెజి టెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) నూత న కార్యవర్గం ఎన్నికైంది.ఈ ఏలూరు జిల్లాలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేయుచున్న అధ్యాపకులు ఎన్నికల్లో హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మర్రి వెంకటేశ్వరరావు (బుట్టాయిగూడెం), కార్యదర్శిగా టీవీ రాంబాబు (జంగా రెడ్డిగూడెం), కోశాధికారిగా కె రమేష్ (కైకలూరు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి అసోసియేషన్ సభ్యులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్‌లు ఆహ్వానం

విశాలాంధ్ర - టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెంలో జరగనున్న మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్‌లను ఆహ్వానిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ కె విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28, 29, 30 తేదీల్లో బొర్రంపాలెంలో మెయిన్ రోడ్డు పక్కన గల సూరిబాబు స్థలంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 50వేలు, రెండవ బహుమతి రూ. 30వేలు, మూడవ బహుమతి రూ. 20వేలు, నాలుగవ బహుమతి రూ.5 వేలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొనే టీంలు ఈనెల 26లోపు రూ. 500లు ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9676669597 నెంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఉంగుటూరు : గ్రామీణ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవ కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్బులను పలువురు అభినందించారు. ఆదివారం ఉంగుటూరు మండలం గొల్లగూడెం హైస్కూల్లో చేబ్రోలు, హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం లో ఏలూరు కామినేని హాస్పిటల్స్ వైద్యులు డా. కొడాలి రామ్ ప్రసీన్ వారి సిబ్బంది తో సేవలు అందించారు. షుగర్, బి పి, గుండె సంబంధ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి, ఉచితం గా మందులు అందజేశారు. లయన్ ఇంజనీర్ బొమ్మిరెడ్డిపల్లి రంగా రావు ఆర్థిక సహాయం తో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరం లో 120 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరం లో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పీవీ రమణ, చేబ్రోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ప్రకాశరావు, లయన్స్ సభ్యులు బొమ్మిరెడ్డి పల్లి రంగారావు, గుణ్ణం బులెబ్బాయ్, వంకిన ప్రతాప్, శీతాల సత్య నారాయణ, శాఖ మూడి మురళీ కృష్ణ, నిర్మల పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : గ్రామ పంచాయతీలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. ప్రాంతీయ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం ఆదివారం మధ్యాహ్నం సిపాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో జరిగింది. యూనియన్ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల సాగించిన కార్యకలాపాలను సుబ్బరాజు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ పంచాయతీల్లో చిర కాలంగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికుల కృషితోనే గ్రామాల్లో త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుద్దీపాలు, వంటి సేవలు ప్రజలకు అందుతున్నాయని, అలాగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో వారి సేవలు కీలకంగా కొనసాగుతున్నాయని అన్నారు. అయితే కాంట్రాక్టు కార్మికులకు సరైన పని పరిస్థితులు , వేతనాలు, ఇతర సదుపాయాలు లేకపో

వడం విచారకరమని సోమసుందర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సేవలను , ఉద్యోగ, వేతన వ్యవస్థలను క్రమబద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ , సహ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని , వారు సానుకూలంగానే స్పందించారని తెలిపారు. అవసరం అయితే సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ఉద్యమానికి పంచాయతీ కార్మికులు సిద్ధం కావాలని డి. సోమసుందర్ పిలుపు ఇచ్చారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ పంచాయతీ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారాంతపు సెలవులు , ఇతర సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్ మాట్లాడుతూ సెలవులు, కనిసవేతనాల విషయంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో జారీ చేసిన గెజిట్లను అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాస రావు , ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని, కార్మికులు చేపట్టే పోరాటాలకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసమస్యలపై మరో సారి ప్రజాప్రతి నిధులను, ఉన్నతాధికారులను కలిసి విన్న వించాలని సమావేశం నిర్ణయించింది. సుమారు ముప్పై గ్రామాల కార్మికులు హాజరయ్యారు.

మానవతా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చు అని కొయ్యలగూడెం మానవతా సంస్థ అధ్యక్షులు మాటూరు. సుధీర్ పేర్కొన్నారు. మండలంలో దిప్పకాయలపాడు గ్రామంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేయగా, వారితో పాటు మానవతా సంస్థ సెక్రటరీ కంభంపాటి సాయి కృష్ణ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు వి. జనార్దన్ రావు, వేత్స .స్వామి, ముప్పనపల్లి. వెంకటేశ్వర రావు, మొట్టమర్రి .ఉమామహేశ్వర రావు, మోహన్ రావు, కాకర్ల నందియ్య, శేషు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం : గ్రామంలో ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గణప వరం గ్రామ సర్పంచ్ మూరా అలం కారం భాస్కరరావు అన్నారు. శని వారం గణపవరం గ్రామ పంచాయితీలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహిం చారు. దీనిలో భాగంగా ఈరోజు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ , చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీల విస్తరణ అధికారి పి.వి.సత్యనారాయణ, పాలక వర్గ సభ్యులు, జనసేన నాయకులు తోట శ్రీను, టీడీపీ నాయకులు, కె.సురేంద్ర కుమార్ వర్మ, పంచాయితీ కార్యదర్శి గ్రేడ్ 1 దార్ల శివ రామ ప్రసాద్, కూట మి నాయకులు, పంచాయితీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గాదిరాజు బాబుకు పితృ వియోగం

విశాలాంధ్ర - భీమవరం : డిఎన్ఆర్ విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు బాబు తండ్రి గాదిరాజు సోమరాజు (94) ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య కాంతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన రోడ్లు భవనాల శాఖలో సుమారు 35 ఏళ్లు ఇంజనీర్గా పనిచేసి, 1989లో సూపరింటెండెంట్ ఇంజనీర్ గా పదవీ విరమణ చేసారు. మాజీ ఎంపి తోట సీతారామలక్ష్మి, సత్యనారాయణ దంపతులు, టిడిపి నాయకులు మెంటే పార్థసారథి, డి.ఎన్.ఆర్.విద్యా సంస్థల అధ్యక్షుడు గోకరాజు నరసింహరాజు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగ రాజు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

తిరండి రమణారావుకి నివాళి...

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక కొత్తపేట, ఏకెజి సెంటర్ సెంటర్, కూని శెట్టి వారి వీధిలో ఆదివారం ఏర్పాటు చేసిన తిరండి రమణారావు కార్యక్రమానికి ఏలూరు పురప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్యనారాయణ లాగా సేవాగుణం అలవాటుకోవాలని సూచించారు.ఈ సందర్భంలో జంపా సూర్యనారాయణ, టీడీపీ డివిజన్ ఇంచార్జ్ ధావాల రంగా మాట్లాడుతూ తిరండి రమణ లాగా సాటి మనిషికి సహాయ పడితే ప్రతి ఒక్కరిని కీర్తిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, సభ్యులు,స్థానికులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వారి కుమారుడు వాసుని, కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.పుర ప్రముఖులు,సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ, పలువురు రమణ చేసిన సేవలు గురించి పలువురు కొనియాడారు.

బెల్లం ఊట ధ్వంసం...



విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం దేవలపల్లి గ్రామ శివారులో సారాయి తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనుబాబు తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు.

మొబైల్ ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలోని అంగన్వాడి పిల్లల నమోదుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రములలో నమోదు కాబడిన 0 - 6 సంవత్సరముల పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేయుటకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. జనవరి 21 నుండి 24 వరకు, జనవరి 27 నుండి 30 వరకు అంగన్వాడి కేంద్రములలో 0- 6 సంవత్సరముల పిల్లల కోసం క్యాంపులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని మొత్తం 90 ఆధార్ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి జిల్లాలోని ఆధార్ కార్డు లేని పిల్లలు ఉన్న అన్ని అంగన్వాడి కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అంగన్వాడి వర్కర్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిడిపిఓలు అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లల తల్లితండ్రులకు తెలియజేసి అవసరమైన ధృవ పత్రాలతో ప్రత్యేక ఆధార్ క్యాంపులో కొత్త ఆధార్ కార్డులకు నమోదు చేసుకోనేలా ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ మండలాల్లో ఆచంట2, ఆకివీడు4, అత్తిలి3, భీమవరం6, యలమంచిలి4, గణపవరం 5, ఇరగవరం3, కాళ్ళ4, మొగల్తూరు4, నరసాపురం3, పాలకొల్లు3, పాలకోడేరు3, పెనుగొండ3, పెనుమంట్ర3 పోడూరు4, తాడేపల్లిగూడెం3, తణుకు6, ఉండి3, వీరవాసరం4 ఆధార్ కేంద్రాలను, అర్బన్ మండలాల్లో భీమవరం4, నరసాపురం4, పాలకొల్లు3, తాడేపల్లిగూడెం3, తణుకు6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు.

విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు

రవాణా అధికారి మహేశ్వరరావు...

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్) మినహాయింపు అవకాశాన్ని జిల్లాలో నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019కి ముందు విద్యుత్ వాహనాలు కొనుగోలుపై అమలు కాబడిన జీవిత పన్ను మినహాయింపుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరల అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో కాలుష్యం రోజు రోజుకు పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వాయు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనముల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చుని సమీక్ష చేసి, విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు మరల అమలులోకి తీసుకువచ్చామని ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదు సంవత్సరాల కాల పరిమితికి జనవరి 2025 నుంచి జనవరి 2030 వరకు అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలిపారు. పన్ను మినహాయింపు స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ టి.ఆర్ జారీ చేసిన వాహనాలకు మరియు ఆంధ్రప్రదేశ్ లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టి.ఆర్ లు జారీచేసిన లైఫ్ టాక్స్ మినహాయింపు వర్తించదని తెలిపారు. కావున రాష్ట్రం వెలుపల ఎలక్ట్రిక్ టి.ఆర్ పట్ల విద్యుత్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. అలాగే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

హెల్మెట్ తప్పనిసరి..

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : జాతీయ భద్రత మాసోత్సవం సందర్భంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని పశ్చిమ గోదావరిజిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ రవాణా తనిఖీ అధికారులు అన్నారు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం లో భాగంగా ఆదివారం భీమవరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని రవాణా శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం రవాణా కార్యాలల అధికారులు పాల్గొని వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవరు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వాహనాలకు ఇన్సూరెన్స్ పొల్యూషన్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని కూడా వారు సూచించారు. వాహనాలు నడిపే సమయాలలో సెల్ ఫోన్ మాట్లాడి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని వారు సూచించారు. మరియు హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారితో వారి అనుభవాన్ని కూడా అందరికీ తెలియజేశారు. మరియు సీ ఎం వి రూల్ 104 ప్రకారం వాహనం ముందు , వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్స్ లేని వాహనాలకు అంటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రవాణా తనిఖీ అధికారులు కే. ప్రసాద్, ఎం రవికుమార్, ఎన్ ఎల్ ఎస్ లక్ష్మి, ఎస్పీ తేజ పాల్గొన్నారు.

నాగరాజుకు శ్రీధర్ పరామర్శ

విశాలాంధ్ర- ఉంగుటూరు : నారాయణపురం ఎంపీటీసీ సభ్యులు, ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజును ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అమెరికా నుంచి ఫోన్లో పరామర్శించారు. నాగరాజు తండ్రి కన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే మండలములో ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు నాగరాజును పరామర్శిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం

మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య

విశాలాంధ్ర - చింతలపూడి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ అలుపెరిగిన పోరాటం చేస్తుందని మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య ఆదివారం సిపిఐ రేచర్ల గ్రామ శాఖ మహాసభ దంతా తిరుపతయ్య అధ్యక్షతన ఈ మహాసభలో పాల్గొన్న కంచర్ల గురవయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ఘనమైనదని, 1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతూ అనేక చట్టాలను తీసుకురావడంలో,ఇటు ప్రజా పోరాటంలో, చట్టసభల్లో సిపిఐ నిర్వహించిన పాత్ర గణనీయమైనదన్నారు.వన సంరక్షణ సమితి సభ్యులకు ఒక హెక్టార్ భూమి వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని,రేచర్ల వాటర్ ట్యాంక్ నుంచి కృష్ణుడు గుడి వరకు ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డు వేయాలని తీర్మానించినట్లు తెలిపారు.మహాసభలో ఇటీవల చనిపోయిన జమ్మి శ్రీనివాస్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. శాఖ కార్యదర్శిగా ఇస్తరాకులు వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.దంతా కృష్ణ,మల్లపూడి కృష్ణ, పూల దాసు,చెంచయ్య,శివయ్య,ముళ్ళపూడి పేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి తెన్నేటి మాస్టారు

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న అక్షర కిరీటి తెన్నేటి మాస్టారుకు మరో అరుదైన పురస్కారం లభించింది.పశ్చిమ గోదావరి మనవంశం సాహితీవేత్త, తెలుగు మాస్టారు తెన్నేటి మాస్టారు తెలుగు భాష, సాహిత్యాలలో చేస్తున్న కృషిని గుర్తించిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ వారలు సంయుక్తంగా తెన్నేటి మాస్టారు కు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించినారు. ఈ అరుదైన జాతీయ పురస్కారాన్ని ఈ 2025 జనవరి 21 వ తేదీ మంగళవారం నాడు శ్రీ కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదిక విజయవాడ నందు జరిగే సభలో అతిధుల చేతుల మీదుగా తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారంతో తెన్నేటి మాస్టారును సన్మానిస్తున్నట్లు శ్రీ శ్రీ కళావేదిక సి. ఇ. వో. శ్రీ కత్తిమండ ప్రతాప్ గారు తెలియచేసారు. ఈ సందర్భంగా మన వంశం మణిధర్, రుద్రరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఆర్వీయస్. రాజు, గొల్లలకోడేరు, పాలకోడేరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ (కరణం గారు) కార్యదర్శి ఫణి, ప్రధానోపాధ్యాయులు మహేష్ బాబు తదితరులు, మన వంశం మిత్రులు, సాహితీ మిత్రులు తెన్నేటి మాస్టారును అభినందించారు.

వేమన శతకం.. సామాజిక వికాసం..

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో శతకాల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన ప్రజా కవి యోగివేమన అని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగివేమన జయంతి వేడుకలు సందర్భంగా యోగివేమన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, పాల్గొన్న డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జెడి గోవిందరాజులు, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎంఎం రాజు, సెట్ వెల్ సిఇఒ ప్రభాకర రావు, బి.సి. కార్పోరేషన్ ఇడి ఎన్. పుష్ప లత, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్.వి. నాగ రాణి, ఐసిడిఎస్ పిడి శారద, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వేమన పద్యాల సందేశాలను నేటి యువతతోపాటు భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. వేమన శతకంలో ఒకో పద్యానికి ఒకో ప్రత్యేకత ఉందన్నారు. వాటిలో కొన్నింటినైనా నేర్చుకుంటే అవి మన వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ "వేమన శతకంలోని "ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా నలుపు నలుపే గానీ తెలుపురాదు.. కొయ్యబొమ్మతెచ్చి కొట్టినా పలుకునా విశ్వదాభిరామ వినురవేమ" పద్యాన్ని స్వయంగా చెబుతూ ఎలుకతోలు అదే పనిగా సంవత్సరంపాటు ఉతికినా తెల్లబడదు, అదే విధంగా కొయ్యబొమ్మను కొట్టినా మాట్లాడదు అం టూ దాని తాత్పర్యాన్ని కూడా వివరించి అందరినీ అబ్బురపరిచారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి కూడా "వేమన శతకంలోని "అనుగాని చోట నదికులమునరాదు కొంచె ముందుబెల్ల కొదువ గాదు కొండ అద్దమందు కొంచమైయుండదా విశ్వ ధాభిరామ వినురవేమ" పద్యాన్ని వినిపించి మనకు తగని ప్రదేశంలో మనల్ని మనం గొప్పవారమని చెప్పుకోవడం ఎంతమాత్రం మంచిదికాదని వాటిని ప్రదర్శించకపోయినంత మాత్రాన మన ఔనత్యానికి ఎలాంటి భంగం లేదని ఆపద్యం తాత్పర్యాన్ని వివరించారు. రెవెన్యూ అధికారి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువాడు ఉండడన్నారు. బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : జేసీ

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన వారికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో ఏలూరు జిల్లాలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందుతున్న సిలిండర్లకు తాము చెల్లించిన నగదు మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నా యని లబ్దిదారులు వ్యక్తం చేస్తున్నారు. లబ్దిదారులు దీపం 2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు..బిల్లుకు అదనంగా రూ. 80 నుండి రూ. 150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యములో రెవెన్యూ, పౌరసరఫరాల సిబంది, సదరు గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారులతో సమా వేశం నిర్వహించి లబ్దిదారులనుంచి వచ్చిన ఫిర్యా దులు రుజువు అయితే గ్యాస్ ఏజన్సీలపై తగు చర్యలు తీసుకోంటామని అట్టి ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆ విధముగా కాకుండా లబ్దిదారుల నుండి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే 18004256453 టోల్ ఫ్రీ నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చును. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయములో జరుగు ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వ్యవస్థ ద్వార కూడా ఫిర్యాదు చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఆర్థికంగా మేలు చేయుటకు ఉద్దేశించిన ఈ పథకం లబ్దిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడరాదని, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగించుట నేరమని, బ్లాక్ మార్కెట్లో అమ్ముటకు ఏజెన్సీలు పాల్పడరాదని తెలియజేశారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుండి 31 వ తేదీ వరకు నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుతవం పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగినన్ని నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నిస్తుందన్నారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి ఉత్పాధకను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చు తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణకు జిల్లాలో గల 27 మండలాల్లో మండలానికి రెండు టీములు చొప్పున ఏర్పాటు చేశారన్నారు. ఒక్కొక్క టీములో ఒక పశు వైద్యుడు, ఒక పారా వెటరినరీ సిబ్బంది,పశువైద్య సహాయకులు, గోపాలామిత్రులు వుంటారన్నారు.

ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి జెడి డా. టి. గోవిందరాజు మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు త్రాగించడం, లేగదూడలకు, పాడి పశువులకు కూడా నట్టల నివారణ మందులు త్రాగించడం జరుగుతుందన్నారు.అంతే కాకుండా అనారోగ్యంగా వున్న పశువులకు చికిత్స చేస్తాము, గర్భకోశ వ్యాధులకు, ఎదకురాని పశువులకు, తిరగపొర్లు పశువులకు పరీక్ష చేసి చికిత్స అందజేస్తున్నామన్నారు. దీంతో పాటుగా 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాడి రైతులను ఉత్సాహపరిచేందుకు, లేగదూడల పెంపకం పట్ల అవగాహన కలిగించేందుకు ఈ లేగదూడల అందాల ప్రదర్శనని ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ అందాలప్రదర్శనకు విచ్చేసిన అన్ని లేగదూడలకు ఖనిజమిశ్రమ లవణాలుగల పేకట్లను ఎదుగుదలకు పనికొచ్చే మందులను ఇవ్వడమే కాకుండా, అందాలప్రదర్శనలో గెలిచిన లేగదూడల రైతులకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఈ క్యాంపుల గురించి రైతుల్లో అవగాహన కలిగించడానికి పోస్టర్లు, కరపత్రాలు ఏర్పాటు చేయడమైనదన్నారు. కాబట్టి జిల్లాలోని రైతు లందరూ ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

వినూత్న కార్యక్రమాలతో సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న అభయా రక్షక దళం వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అభయ రక్షక దళం బృందాలు మహిళలకు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు స్వీయ రక్షణ కోసం పోలీస్ శాఖ అందుబాటులో తీసుకువచ్చిన 1930, 112, 100 నెంబర్లపై విస్తృ త ప్రచారం నిర్వహిస్తుంది. సమాజం లో జరుగుతున్న అనర్ధాలను గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం మహిళల, బాలికల, వృద్ధుల రక్షణ కొరకు, అభయ దృశ్య రూపక వాహనం ద్వార చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రక్రియలో భాగంగా ఆదివారం ఏలూరులోని కండ్రిక గూడెం ప్రాంతాలలో ప్రచార కార్యక్ర మాలను నిర్వహించారు. మహిళలు ఇబ్బందులకు గురైతే వెంటనే పైన తెలిపిన నెంబర్లకు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలో మహిళా పోలీసులు సంఘటన స్థలానికి చేరు కొని వారిని సంరక్షిస్తారని ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఇటీ వల ప్రారంభించిన నూతన ప్రచార వాహనం ద్వారా ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో డిజిటల్ ప్రొజెక్టర్ తో మహిళలపై జరిగే అఘాయిత్యాలను వివరిస్తూ తదనుగుణంగా రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అభయ రక్షక దళం ఇంచార్జ్, మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ వివరిస్తున్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తున్న వారి మీద తక్షణ చర్యలు తీసుకోవడానికి పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ప్రజలు 1098 హెల్ప్‌లైన్ నెంబరు ద్వారా సమాచారాన్ని అందించవచ్చు. పోలీసులు ఇచ్చే సేవల పట్ల ప్రజలలో విశ్వాసం పెంచుతూ, అత్యవసర సేవలు వేగంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అభయ వాహనాల ద్వారా మహిళా పోలీసులు పలు పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర ప్రధాన ప్రాంతాల్లో పర్యటిస్తూ, ప్రజలలో చట్టాలు మరియు రక్షణ చర్యలపై అవగాహన పెంచుతున్నారు. జిల్లాలో ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా సామాజిక సమస్యలు ఉన్న సందర్భంలో ప్రజలు వెంటనే 9550351100 నెంబరు ద్వారా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలియజేయాలని, ప్రజల భాగస్వామ్యంతో నేర నిర్మూలనకు సాధ్యపడుతుందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

రుద్రరాజు ఉన్నత పదవులు అధిరోహించాలి : అరుణ్‌కుమారి

విశాలాంధ్ర –కొవ్వూరు : పీసీసీ అధ్యక్షుడిగా గిడుగు రుద్రరాజు పార్టీని బలోపేతం చేశారని తద్వారా సీడబ్ల్యూసీ సభ్యుడిగా పార్టీ అధిష్టానం గుర్తించిందని, రుద్రరాజు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణ్ కుమారి శుభాకాంక్షలు తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యుడిగా దేశ స్థాయిలో ఆయన మరిన్ని సేవలు అందించాలని అరుణ కుమారి ఆకాంక్షించారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర – సీతానగరం: నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభించనున్నట్లు మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఏ ఫణీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణీంద్ర విలేకరులతో మాట్లాడుతూ జనవరి 20 నుంచి 31 వరకూ సీతానగరం మండలంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరాలు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పది ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని అన్నారు. పాడి రైతులంతా ఈ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పీజీఆర్ఎస్'కు హాజరు కానున్న కలెక్టరు

విశాలాంధ్ర – రాజానగరం : ప్రజలు సమస్యల పరిష్కార మార్గాలు చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన రాజానగరంలో నేడు జరగనున్న పిజిఆర్ఎస్‌కి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా రాజానగరం మండలం లోని అర్జీదారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు. జిల్లా,డివిజన్ మండల స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా,డివిజన్, మండల స్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రాలకు తప్పని సరిగా హాజరు కావాలని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని ఆదేశించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలో ఉండేశ్వరపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం శుద్ద చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండేశ్వరపుర గ్రామానికి చెందిన చండిక వెంకన్న వయస్సు (27) చెరువు వద్దకు వెళ్ళినప్పుడు ఒక్కసారిగా పిట్స్ రావడంతో చెరువులో పడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. దీనిపై ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర – అమలాపురం : మనం సంతోషంలో ఉన్నప్పుడు అందరూ వస్తారు. అదే కష్టంలో ఉంటే. ఐనవారు కూడా పరాయివాళ్ళు అయ్యే కాలం ఇది. ఇది జగమెరిగిన సత్యం. కానీ మన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాత్రం ఎవరికి కష్టమొచ్చినా. బాధ వచ్చిన మీకు నేనున్నా అంటూ ఆపన్న హస్తం అందిస్తూ ఆర్థిక సహాయం చేయటంతోపాటు..ఆ కుటుంబాలకు ధైర్యం చెబుతూ ఓదార్పు, పరామర్శలు చేస్తూ తన మానవత్వం చాటుకుంటున్నారు. ఆదివారం వెల్ల గ్రామంలో ఇటీవల అకాల మృతి చెందిన యార్లగడ్డ శ్రీను కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన కూనపరెడ్డి వరలక్ష్మి, తుమ్మరపల్లి మంగలక్ష్మి కుటుంబాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, తదితరులతో కలిసి పరామర్శించి ఓదార్పు చెప్పారు. తన

దైనందిన బిజీ కార్యక్రమాలు ఉన్నప్పటికీ తన సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తూ..ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆపదలో, కష్ట కాలంలో ఉన్న కుటుంబాలు స్వాంతన పొందే విధంగా ఆర్థికంగా సహాయం చేస్తూ వారి కుటుంబాలకు కొండంత అండగా నిలబడుతున్నారు. మంచి మనసు, మానవత్వం ఉన్న నాయకుడు మా నియోజకవర్గానికి మంత్రిగా ఉండటం మా అదృష్టమంటూ పలువురు రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు మంత్రి సుభాష్ సేవలను కొనియాడుతున్నారు.

మహోన్నత వ్యక్తి యోగి వేమన : జేసీ

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : జీవిత సత్యాలను పద్యాల రూపంలో అందించిన మహోన్నత వ్యక్తి యోగి వేమన అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. స్థానిక కలక్టరేట్‌లో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలు సందర్భంగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ వేమన ఎన్నో భోగ భాగ్యాలు అనుభవించి, అవి ఏవీ జీవిత సత్యాలు కాదని తన రచనలు ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. తన రచనలు ద్వారా గొప్ప తెలుగు తత్వవేత్త మరియు కవిగాను, ఆయన కవితలు తెలుగులో సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడం ద్వారా ప్రతి ఒక్కరికీ దగ్గర అయ్యాయన్నారు. ఉప్పు కర్పూరం ఒక్కలా ఉన్నా రుచులు వేరని

ఉప్పకప్పురంభు పద్యం ద్వారా, మనుషులందు పుణ్య పురుషులు వేరయా అంటూ మానవుల్లో స్వభావరీత్యా కలిగిన వ్యత్యాసాన్ని తన రచనలు ద్వారా చాటి చెప్పడం జరిగిందన్నారు. ఆయన రచనలు ద్వారా జీవితా సత్యాలను తెలుసుకుని భావితరాలకు అందించే ప్రయత్నం ప్రతి ఒక్కరు చేయ్యాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి శశాంక, కలక్టరేట్ ఏవో ఎండీ ఆలీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల వ్రాత పరీక్షలు

విశాలాంధ్ర – రాజానగరం : రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏర్పడ్డ రేషన్ డీలర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు మండలంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదివారం నిర్వహించిన రేషన్ డీలర్లు వ్రాత పరీక్షలు ప్రశాతంగా ముగిశాయి. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 145 పోస్టుల భర్తీకి సంబంధించి 487 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షలకు 465 మంది అభ్యర్థులు హాజరుకాగ 22 మంది వివిధ కారణాలతో గైహాజరయ్యారు. పరీక్ష కేంద్రానికి తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు,ఆర్డీవో కృష్ణ నాయక్ పరీక్షల ప్రక్రియను పరిశీలించారు. రాజానగరం తహసీల్దార్ జిఎల్ సత్యవతి దేవి, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర – కడియం : కడియం మండలం, కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 నుంచి2000 వరకు కలసి చదువుకున్న హైస్కూల్ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రీ-యూనియన్ 2025 అనే వేడుక ఆదివారం నిర్వహించారు. అప్పట్లో వారికి విద్య బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు కె సుబ్బలక్ష్మి, కుమారి, సూర్య బేగం, శ్రీనివాస్, అరిగెల సూరిబాబు లను, అప్పట్లో గుమాస్తాగా పని చేసిన జోషి, అలాగే నైట్ వాచ్మేన్ గా పనిచేసిన రమణమ్మను ఘనంగా సత్కరించారు. వారు పూర్వపు రోజులను గుర్తు చేసుకున్నారు. కాదంబరి సూర్య శ్రీనివాసరావు, గెద్దం శివ, కొత్తపల్లి శివాజీ, పేకేటి బ్రహ్మాజీ, దొడ్డా సూరిబాబు , సిద్దిరెడ్డి భాను ప్రకాష్, పాఠంశెట్టి రాజేష్, చెక్కపల్లి సతీష్, అక్కివరపు నాగసత్యం, పాఠంశెట్టి సత్యవతి, గట్టి అనిత, గ్రంధి హిమబిందు, చెక్కపల్లి శివరామకృష్ణ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర – సామర్లకోట : సామర్లకోట పట్టణంలో అనేక వార్డులలో అభివృద్ధి పనులకు సోమవారం ఉదయం పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపనలు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి వేరు, వేరు ప్రకటనలో తెలియజేశారు. 27వ వార్డు ఫ్లీడరుతోట నందు సీసీ రోడ్, 30, 31 వార్డు లారీ స్టాండ్ రోడ్ నుంచి భాస్కర్ నగర్ కాలనీ వరకు సీసీ రోడ్, 1,9వ వార్డు నందు గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి బుధవారం మార్కెట్ జాంక్షన్ వరకు సీసీ రోడ్, 22, 24వ వార్డు నందు మఠం సెంటర్ నుంచి నిమ్మతోట వరకు సీసీ రోడ్డి బిపిఎస్ నిధులతో రోడ్లు వేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల బాబు బిజెపి పెద్దాపురం నియోజకవర్గం ఇంచార్జ్ విత్తనాల వెంకటరమణ, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్లు మరియు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొంటారన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర – కరప : ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో ఇందులో భాగంగా కరప మండలంలోని అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏడి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. పశువులు కొచ్చే వ్యాధులు, లేక దూడలలో ఏలిక పాములు, గొడ్డు పశువులకు గర్భాశయానికి వచ్చే వ్యాధులకు చికిత్సలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, అన్నింటికీ పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20న గొరుపూడి, 21న గురజనాపల్లి, ఉప్పలంక కూరాడ, 22న పెనుగుదురు, వాకాడ, 23న వేములవాడ, పెదకొత్తూరు, 24న వలసపాకల, సిరిపురం. 25న జీ భావారం యండమూరు, 27న నడకుదురు, వేలంగి, 28న కరప, పాతర్లగడ్డ, పెద్దాపురప్పాడు, 29న విజయ రాయుడుపాలెం, కొంగుడు, 30న జెడ్ బావవరం, కోరిపల్లి, 31న అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాలలో శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని డాక్టర్ సురేష్ బాబు తెలిపారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర – కడియం : పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31 వరకు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించడానికి తగిన ప్రణాళికలు చేపట్టినట్లు కడియం వెటర్నరీ ఏడి డాక్టర్ జి రవివర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లేగ దూడలకు పాముల మందు, పశువులకు జలగ మందు, గొర్రెలు మేకలకు నట్టల నివారణకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలలోని మొత్తం గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ జి రవివర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి చేతిని కోల్పోయిన చిన్నారి

విశాలాంధ్ర – అమలాపురం : అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యానికి ఓ చిన్నారి చేతిని కోల్పోయింది. అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో కేతా లాస్య మాధురి డాబా మీద ఆడుకుంటుండగా విద్యుత్ షాక్ గురై తీవ్ర గాయాలు అయ్యాయి. రక్షించబోయిన ఆమె తల్లి కేతా రమాదేవికి తీవ్ర గాయాలు. ఇరువురిని కాకినాడ జిజిహెచ్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు. శస్త్రచికిత్స చేసి లాస్య మాధురి చేతిని తొలగించిన వైద్యులు. సంక్రాంతి సెలవులకు కాకినాడ నుంచి గోడి కొత్తకాలనీకి వచ్చిన లాస్య మాధురి కుటుంబ సభ్యులు. తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడు వినలేదని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చేతిని కోల్పో యిందని కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

ఘనంగా వేమన జయంతి

విశాలాంధ్ర – ఆలమూరు : వేమన పద్యాలు, శతకాలలోని నీతిని జీవితంలో అనుకరించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారా యణరెడ్డి (దొరబాబు) అన్నారు. ఆలమూరు మండలంలోని జొన్నాడరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. వారు మాట్లాడుతూ వేమన ఎంతో లోతైన భావాన్ని సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదాయానికి హత్తుకునేలా చెప్పాడన్నారు. ఉప సర్పంచ్ నాండ్ర నాగమోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస రెడ్డి, ఎంపిటిసి మారిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి తాడి నాగమోహన రెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి, మేడపాటి వెంకట కృష్ణ రెడ్డి, సత్తి వెంకట రెడ్డి, తాడి సత్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కళాశాహితి ఆధ్వర్యంలో

విశాలాంధ్ర – ముమ్మిడివరం : ముమ్మిడివరం కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న టెట్ భవనం నందు కళాశాహితి ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతి జరిగినది. ఈకార్యక్రమంనకు కళాశాహితి సహాయకార్యదర్శి పి విజయకుమార్ ఆహ్వానం పలుకగా, కళాశాహితి పూర్వ అధ్యక్షులు మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశానికి నేరేడుమెల్లి అబ్బులు మాస్టారు మరియు కవిశ్రీ నాగేంద్ర మాట్లాడుతూ వేమన తన పద్యాల రూపంలో ప్రజావిప్లవాన్ని సృష్టించిన వ్యక్తి అని కొనియాడారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు విత్తనాల వరప్రసాద్, సభ్యులు మెల్లం దుర్గాప్రసాద్, గెద్దం శ్రీను, దేవరపల్లి సత్యనారాయణ, లంకే హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ ఎస్ లక్ష్మీకాంతం కథనం మేరకు ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమణి శివ (22) తునిలో బంధువుల ఇంట జరిగే ఫంక్షనకు మోటార్ బైక్‌పై వెళుతుండగా బైక్ ధర్మవరం పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి ఒక లారీని మరో లారీ ఓవర్ టెక్ చేస్తూ బైక్ పై వెళ్తున్న రాజమణి శివను వెనక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్ షా గో బ్యాక్

వామపక్ష పార్టీల, దళిత సంఘంల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర–రాజమహేంద్రవరం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో విద్వేష అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయ్యాలని, నేడు రాష్ట్ర పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గో బ్యాక్ అమిత్ షా పేరుతో నిరసనలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం నగరంలో నిర్వహించారు. స్థానిక గోకవరం బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో వామపక్ష పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా నాయకురాలు పి లావణ్య, సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు జె.సత్తిబాబు, మాట్లాడుతూ పార్లమెంట్ లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భారత పార్లమెంట్ వ్యవస్థకు ప్రజా స్వామ్యానికి మూల స్తంభం అయిన డాక్టర్ అంబేద్కర్ అంటే బీజేపీ ఆర్ ఎస్ ఎస్ శక్తులకు ఎంత ద్వేషం ఉందో షా వ్యాఖ్యలు అర్థంపడుతుందని, ఈ శక్తులకు రాజ్యాంగం అన్నా అంబేద్కర్ అన్నా ద్వేషం అని రాజ్యాంగం బదులు మనుస్మృతి పాలన కోసం రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, పి.తులసి, జిల్లా కమిటీ సభ్యులు కర్రి. రామకిష్ణ, పూర్ణిమరాజు, రాజా, నాయకులు ఎన్. ఎస్. మూర్తి, పి.మురళి, తాతరావు, కాంతారావు, పదాల. రామకృష్ణ, భాస్కర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి లావణ్య , సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు టి నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు త్రిమూర్తులు కొండవతి,సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ జె.సత్తిబాబు, దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, అంబటి సత్యనారాయణ పాల్గొన్నారు

నారా లోకేశ్ ఉపముఖ్యమంత్రి కావాలి : వర్మ

విశాలాంధ్ర – పిఠాపురం : నారా లోకేశ్ ఉపముఖ్యమంత్రి కావాలని తెలుగుదేశం పార్టీలోని కోటిమంది కార్యకర్తలూ కోరుకుంటున్నారని, పార్టీకి కరుడుగట్టిన సైనికుడునైన తానూ అందులో ఉన్నానని, అవసాన స్థితికి చేరుకున్న పార్టీకి తన పాదయాత్రతో పునరుజ్జీవమిచ్చి, కార్యకర్తల్లో ధైర్యం నింపి, పార్టీకి వెన్నెముకగా నిలిచిన నారా లోకేశును ఉప ముఖ్యమంత్రి చేయాలని తామంతా అనుకోవడంలో తప్పేంటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. కార్యకర్తల మనోభావాలను అధిష్ఠానం గౌరవించాల్సిందేనంటూ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే వర్మ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేశ్ పార్టీకి కోటి సభ్యత్వాలు చేసి పార్టీని ప్రపంచంలోనే ఏకైక పార్టీగా నిలిపినందుకు పిఠాపురం నియోజకవర్గ టీడీపీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

శ్యామ్‌కుమార్‌కు జాతీయ రజితోత్సవ సేవా పురస్కారం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందినటువంటి ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలి కుడు మనస్తత్వవేత్త ఉపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ కోనసీమ చిత్రకళా పరిషత్ 35వ వార్షికోత్సవం సందర్భంగా కళ బ్రహ్మోత్సవాలలో అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శ్యామ్ విద్యా వ్యవస్థకు చేస్తున్న కృషికి కోనసీమ చిత్రకళా పరిషత్ రజితోత్సవ సేవ పరిస్కారాన్ని అందుకున్నారు. అనంతరం శ్యామ్ ఇచ్చిన బ్లైండ్ ఫోల్డ్ ప్రదర్శన విశేషంగా ఆకట్టు కుంది. కళాపరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామస్వామి, రవితేజ, లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్ కృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నల్ల మిర్చి

విశాలాంధ్ర – కడియం : కడియం మండలం కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక గ్రామానికి చెందిన అంగన్వాడీ ఎం వరలక్ష్మి ఇంట్లో నల్ల పచ్చి మిరపకాయలతో మొక్క చూపరులను ఆశ్చర్యప రుస్తుంది. సహజంగా మిరపకాయలు ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లో వుంటాయి. వరలక్ష్మీ భర్త మలసాని గోవిందరాజుకు సుమారు 70 రోజుల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన స్నేహితుడొకాయన ఆ మొక్కను ఇచ్చారు. ఈ మొక్క సుమారు 15 రోజుల నుంచి కాపు కాస్తూ, ప్రస్తుతం 40 నుండి 50 పచ్చిమిరపకాయలతో స్థానికులను అబ్బుర పరుస్తుంది. వివిధ దినపత్రికల ఏజెంట్‌గా కొనసాగుతున్న గోవిందరాజు రోజు వారీ పత్రికలు పంచుతూ తన ఇంట కాస్తున్న నల్లమిరపకాయల గురించి తెలియపరుస్తూ సంతోషిస్తున్నారు. సాధారణ దేశవాళీ పచ్చిమిర్చితో పోల్చితే మరింత ఘాటుగా ఉంటుందని, చిట్టి మిరప జాతికి చెందిన రకమని మండల ఉద్యాన శాఖ అధికారి డి సుధీర్ కుమార్ తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL SENIOR CIVIL JUDGE :: AT RAJAMAHENDRAVARAM

O.S. 10/2024

Between:
Smt. Nallamilli Surya Prabha - Plaintiff
And
Mr. Velaga Jagadeeswar Veera Venkata Prasad - Defendant
To
Mr. Velaga Jagadeeswar Veera Venkata Prasad, S/o. Velaga Satti Raju,
D.No. 45-3-30, 2nd Street,
Andhranagar, Rajamahendravaram,
East Godavari District - **Defendant**

NOTICE

Please take notice that the Honourable Court was pleased to order notice to you in the above matter through this publication as the above petitioner/ plaintiff filed the above Mortgage suit against you, Therefore you are hereby called upon to appear before this Honourable Court on **11-02-2025; at 10.30 A.M.**, personally or through an Advocate. If you fail to appear before this Honourable Court on that day the matter will be heard in your absence and necessary orders will be passed.

Sri. N.S.V.REDDY, Advocate
Venumahdavi Villa, N.G.G.O's Colony
Akkayapalem, Visakhapatnam-16
Mobile: 9393102036
Visakhapatnam, Dt. 20-01-2025

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర–దేవరపల్లి: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని తక్షణమే రాజీనామా చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ అమిత్ షా గో బ్యాక్ కార్యక్రమాన్ని వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం దేవరపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే రత్నాజీ. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సిహెచ్ రమేష్, సిపిఐ నాయకులు ఆచంట సత్యనారాయణ, ఏఐఎఫ్‌టియు నాయకులు పి పెంటయ్య, సీపీఎం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, పెనమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్, మేడా వెంకటేష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి నాగేశ్వరరావు పాల్గొన్నారు

నిరసన

విశాలాంధ్ర–కొవ్వూరు: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపినట్లు పట్టణ కార్యదర్శి బీరా రవి తెలిపారు. తక్షణం ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు దగ్గు రాధాకృష్ణ, పి చినబాబు, ఎం జ్యోతి బసు పాల్గొన్నారు

క్రియ దస్తావేజులు పోయినది

మా క్లయింటు కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, చొల్లంగి పేట, డోర్ నెం. 3-125 రు కాపురస్తులు **శ్రీ గెల్లా టార్జన్ గారి కుమార్తె మరియు కుసుమ ప్రభువర్మ గారి భార్య అయిన శ్రీమతి గెల్లా విజయకుమారి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ పై యవన్మందికీ తెలుయజేయునది ఏమనగా:

మా క్లయింటు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని ది.16-04-2016వ తేదిన క్రయ దస్తావేజు రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం.1711/2016, రిత్యా ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్థి మా క్లయింటు కసిరెడ్డి నాగేశ్వరరావు తరుపు జనరల్ పవర్ అఫ్ అటార్నీ ఒల్డర్ కొప్పిశెట్టి గణేష్ వద్దనుండి కొనుగోలుచేసి ఉన్నారు. ఈ ఆస్థి తాలూకు ఒరిజినల్ కొనుగోలు దస్తావేజు, డాక్యుమెంట్ నెం.1711/2016, ది. 16-04-2016వ తేది తాలుకు దస్తావేజు మరియు కసిరెడ్డి నాగేశ్వరరావుగారి లింక్ డాక్యుమెంట్ నెం.4172/2011, ది. 07-12-2011వ తేది తాలుకు దస్తావేజు మరియు కసిరెడ్డి నాగేశ్వరరావు తరుపు జనరల్ పవర్ అఫ్ అటార్నీ ఒల్డర్ కొప్పిశెట్టి గణేష్ గారి తాలుకు జనరల్ పవర్ అఫ్ అటార్నీ దస్తావేజు, డాక్యుమెంట్ నెం.27/2016, ది.4-01-2016 వ తేది తాలుకు దస్తావేజు మా క్లయింటు ది. 10-01-2025 వ తేదిన ఉదయం 10.00 గంటల సమయంలో జెరాక్స్ తీసుకొను నిమిత్తం మా క్లయింటు వారి ఇంటి వద్ద నుండి అనగా చొల్లంగిపేట నుండి తాళ్ళరేవు మెయిన్ రోడ్డు గల జిరాక్స్ షాపు వద్దకు పైన ఉదాహరించిన ఒరిజినల్ కొనుగోలు దస్తావేజులు, డాక్యుమెంట్ నెం.1711/2016, ది.16-04-2016, మరియు లింక్ డాక్యుమెంట్స్ ను సంచిలో ఉంచుకొని తాళ్ళరేవు మెయిన్ రోడ్డు గల జిరాక్స్ షాపు వద్దకు వెళ్ళి సంచిలో చూడగా ఒరిజినల్ కొనుగోలు దస్తావేజు మరియు లింక్ డాకుమెంట్స్ దారి ఎక్కడో పడిపోయినట్లు తెలియవచ్చినది. కావున యావన్మందికీ తెలియజేయునది ఏ మనగా ఈ క్రింది ఉదాహరించిన దస్తావేజులు అనగా

(1) ది.16-04-2016వ తేదిన క్రయ దస్తావేజు రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం.1711/2016,
(2) ది. 07-12-2011వ తేదిన కసిరెడ్డి నాగేశ్వరరావు గారి తాలూకా లింక్ క్రయ దస్తావేజు రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం. 4172/2011 మరియు
(3) ది. 04-01-2016వ తేదిన కసిరెడ్డి నాగేశ్వరరావు తరుపు జనరల్ పవర్ అఫ్ అటార్నీ ఒల్డర్ కొప్పిశెట్టి గణేష్ గారి తాలుకు జనరల్ పవర్ అఫ్ అటార్నీ దస్తావేజు, డాక్యుమెంట్ నెం.27/2016.

పైన ఉదాహరించిన క్రయ దస్తావేజు మరియు లింక్ దస్తావేజులు, ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తీసుకొనివచ్చి ఇచ్చిన యెడల మీకు తగిన పారితోషకం యివ్వబడును.

షెడ్యూలు: పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, సర్పవరం సబు-రిజిస్ట్రారులో మాధవపట్నం గ్రామ పంచాయతీకి చెందిన, మాధవపట్నం గ్రామ తాలుకు జిరాయితీ పల్లం రి. సర్వే నెం.2/1ఎ రు నెం.57/బి రు గా అప్రూవలుకాబడిన, ప్లాట్ నెం.7 రు చ.గ.160 లులో తూర్పు వైపు చ.గ.60 లు, ప్లాట్ నెం.6 రు చ.గ.160 లులో పడమర వైపు చ.గ.40 లు వెరశి మొత్తం చ.గ. 100 లు లేక 83.61 చ.మీలు ఖాళీ స్థలమునకు హద్దులు, కొలతల వివరం: **తూర్పు:** అ.36 లు లేక 10.97 మీటర్లు ప్లాట్ నెం.6 రులో డి. చిన్నారావు వగైరాల స్థలం. **పడమర:** అ.36 లు లేక 10.97 మీటర్లు గంటి శంకర్ప్రసన్న శాస్త్రి, గంటి రామశ్రీ గారి తాలూకు ప్లాట్ నెం.7 రులో స్థలం. **ఉత్తరం:** అ.25 లు లేక 7.62 మీటర్లు రోడ్డు. **దక్షిణం:** అ.25 లు లేక 7.62 మీటర్లు ప్లాట్ నెం.10 రు కొంతమేర, ప్లాట్ నెం. 11 రు కొంతమేర.

సదరు హద్దులు మధ్యస్తమైన చ.గ. 100 లు లేక 83.61 చ.మీలు ఖాళీ స్థలము, అందలి నీటివసరులు, మార్గపు హక్కులు, వగైరా యావత్తు యీజిమెంటు హక్కులతో సర్వం సహా.

కాకినాడ
18-1-2025

పలివెల వెంకటేశ్వరరావు, అడ్వకేట్
డోర్ నెం.1-12-5, మిలటరీ రోడ్, నీయర్ భానుగుడి జంక్షన్, కాకినాడ – 533 003. సెల్ నెం. 98488 48152

నర్సరీని సందర్శించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీని రాజ మహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణ నాయక్ శనివారం సందర్శించారు. ఆయనకు శ్రీ సత్య దేవా నర్సరీ చైర్మన్ పుల్లా పెద్ద సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. మొక్కలను తిలకించేందుకు విచ్చేసిన కృష్ణ నాయక్ నర్సరీ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. నర్సరీని స్థాపించిన కడియం నర్సరీ మ్యాన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పుల్లా చంటియ్యకు ఘన నివాళులర్పించారు. దేశ విదేశీ మొక్కలతో శ్రీ సత్యదేవ నర్సరీ కనువిందు చేస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట కడియం తహసీల్దార్ కె పోసిబాబు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మెర్ల కృష్ణ, సత్యదేవా నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే గోరంట్ల

విశాలాంధ్ర - కడియం : రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అభాగ్యుల పాలిట అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి భరోసా కల్పించారు. కడియం మండలం కడియపులంకలో అత్యాచారానికి గురై అసువులు బాసిన బాధితురాలు కస్తూరి కుటుంబానికి కడియపులంక పంచాయతీ దోసలమ్మ కాలనీ నందు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థల పట్టాను ఆర్డీఓ ఆర్ కృష్ణా నాయక్‌తో కలిసి ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ దివ్యాంగురాలైన కుమార్తెకు ఫిబ్రవరి మాసం నుంచి 6000 పింఛను అందించడం జరుగుతుందని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని, కుమారుడి చదువు పూర్తి కాగానే ఉపాధి కల్పనకు అవకాశం ఇస్తామన్నారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించారు. దీంతోపాటు అదనంగా మరో 25 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తూ, త్వరలో మరొక లక్ష రూపాయలు బాధిత కుటుంబానికి అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రాఘురామ్, సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, గట్టి సుబ్బారావు, బోడపాటి గోపి, గట్టి నరసయ్య, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఎమ్మార్వో పోసిబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, అన్నందేవుల కోదండ రాముడు, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అఖిలాంధ్ర సాదు పరిషత్ 60వ మహోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో ఆదివారం అఖిలాంధ్ర సాదు పరిషత్ 60వ మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. తెల్లవారి జాము నుంచి హోమాలు, పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు భగవద్గీత పారాయణ జరిగింది. అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు శ్రీమాతా పరావిద్యానందగిరి స్వామిని ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన సాధు పొంగవులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చారు. అనంతరం దేవరపల్లిలో జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం మహిళ కమిటీ సభ్యులు సౌందర్యలహరి పారాయణ చేశారు. నిడదవోలు మండలం సమిశ్రీ గూడెం గ్రామానికి చెందిన భక్తులు అన్నమాచార్య కీర్తనలు గానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన సాధువులు, ఆహ్వాన కమిటీ సభ్యులు గద్దె మున్నేశ్వరరావు, బల్ల సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, చొంకవెల్లి వెంకట రామారావు, ఆచంట వెంకట సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు, గడ రాంబాబు, ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ కార్యదర్శి తోట సత్యనారాయణ దేవరపల్లి గోపాలపురం మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల పరీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 మండలాల్లో 146 రేషన్ షాపుల ఖాళీలకు గాను 709 మందికి కాకినాడ, పెద్దాపురం డివిజన్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 654 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కాకినాడ డివిజన్‌కు సంబంధించి 10 మండలాల్లో ఉన్న 96 ఖాళీలకు 584 అభ్యర్థులకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీఆర్ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 535 మంది పరీక్షకు హాజరైయారు. ఈ రేషన్ డీలర్ల పరీక్షను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు పరిశీలించారు. అదేవిధంగా పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాల్లో 50 రేషన్ డీలర్ల ఖాళీలకు 125 మందికి పెద్దాపురం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 119 మంది పరీక్షకు హాజరైయారు. పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో కె శ్రీరమణి తనిఖీ చేశారు.

రేషన్ డీలర్లకు పరీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న వివిధ రేషన్ షాపు ఖాళీలు, ఎక్కువ కార్డులు ఉన్న దగ్గర విభజించి కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపులు సంబంధించి ఉన్న 490 ఖాళీలకు సంబంధించి వ్రాత పరీక్షలు ఆదివారం నిర్వహించడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా పౌర సరఫరాల అధికారి ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు జిల్లాలోని మూడు డివిజన్లో ఈ వ్రాత పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన వ్రాత పరీక్ష కేంద్రంను స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిని కే మాధవి, రామచంద్రపురం ఆర్డీవో డి అఖిల పరిశీలించారనీ డీఎస్ఓ తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలో క్రిస్మస్ వేడుకలలో భాగంగా మిన్ బ్రదర్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో గత నెల 24న నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతుల ప్రధానం చేశారు. బైబిల్ క్విజ్, ఇతర ఆటల పోటీలను నిర్వహించగా, యాళ్ల దేవదాస్ హయ్యర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్యాంసుందర్ బహుమతులను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న గ్రామ నాయకులైన తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), నాంద్ర నాగ మోహన్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది డాక్టర్ చెరుకూరి శ్రీహరి, గుత్తుల శ్రీనివాస్ కలిసి బహుమతులను విద్యార్థులకు అందజేసి అభినందించారు. పాస్టర్ చంద్రశేఖర్, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

మురళి కుమార్‌కు అభినందనలు

విశాలాంధ్ర - సామర్లకోట : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో హరిద్వార్‌లో ఈ నెల 28న 38వ నేషనల్ గేమ్స్ అట్టహాసంగా ప్రారంభించనున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ నేషనల్ గేమ్స్‌కి సామర్లకోటకు చెందిన జగ్గంపేట ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్గా పనిచేస్తున్న భోగిళ్ళ మురళి కుమార్, కాకినాడ మున్సిపల్ హైస్కూల్లో పనిచేస్తున్న శ్రీనివాస్ కుమార్ కబడ్డీ టెక్నికల్ అఫీషియల్‌గా ఉత్తర్వులు అందుకోవడం జరిగిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కొండపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి లంక జార్జి అభినందనలు తెలియజేశారు. ఇంటర్నేషనల్ కబడ్డీకోచ్ పోతుల సాయిప్రసాదు. నిమ్మకాయల కిరణ్ కుమార్, తాళ్ళూరి వైకుంఠం మాస్టార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరువురికి అభినందనలు తెలియచేశారు.

భక్తులు దుర్గమ్మ ఆలయ సందర్శన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున మామిడి చెట్టు కింద వెలిసిన దుర్గమ్మ ఆలయ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుప్రక్కల జిల్లాల భక్తులు అమ్మవారి దర్శనంకు రావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. దర్శనానికి వచ్చిన భక్తులకు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

రైతులకు భారంగా గోకులాల నిర్మాణాలు

విశాలాంధ్ర - సీతానగరం: పాడి రైతులకు భారంగా మారిన గోకులాల నిర్మాణాలు. మండల వ్యాప్తంగా 38 గోకులాలు మంజూరు అయ్యాయి. అందులో 23 నిర్మాణం పూర్తి అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతుల భరోసా కలిపిస్తు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా రెండు, నాలుగు, ఆరు గోవులను లేదా గేదెలను సంరక్షించే విధంగా గోకులాల నిర్మాణానికి నిధులను కేటాయించిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే వీటిలో కొన్ని ఎమ్మెల్యే చేతులు మీదుగా ప్రారంభించారు. ఇంత వరకూ బాగానే ఉంది అయితే ఈ గోకులాలకు నేటి వరకూ ఒక్క రూపాయి బిల్లు పడలేదు అని రైతులు వాపోతున్నారు. అసలే రబీ సీజన్లో పంట పెట్టుబడుల రోజుల్లో సుమారు ఒకో గోకులానికి ఒక లక్ష నుండి రెండు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, కానీ నేటి వరకూ ఒక్క రూపాయి బిల్లు చెల్లించ లేదు అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం చేపట్టే ముందు దశల వారీగా బిల్లులు మంజూరు అవుతాయని అధికారులు చెప్పారు. నిర్మాణం పూర్తి చేసిన నేటికీ బిల్లులు అందలేదని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి పాడి రైతులకు ఆర్థిక భారం నుంచి విముక్తి కలిగించాలని రైతులు కోరుతున్నారు.

మల్లేశ్వరరావును ముదునూరి పరామర్శ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : బవురువాక గ్రామం సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ తండ్రి మల్లేశ్వరరావు అనారోగ్యంతో ఉండడంతో వారిని పలకరించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు అలాగే అదే గ్రామంలో జలుమూరు గంగరాజు కాలు ఇన్ఫెక్షన్ సమస్యతో బాధపడుతున్న గంగరాజుకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతా అప్పారావు, నంద జగ్గారావు, సతీష్ రాజు, కించి కన్నా రావు, కాకర చంటిబాబు, శెశెట్టి కోదండ, కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రహదారి

- 3 నెలలుగా కొనసాగుతున్న పనులు...
- దుమ్ము,ధూళితో రోగాల బారిన ప్రజలు....
- ప్రమాదాలకు నెలవుగా రోడ్డు...
- దెబ్బతింటున్న పంట పొలాలు...
- ఆందోళనలో నిర్వహించిన సీపీఐ

విశాలాంధ్ర - కుక్కునూరు: ఏలూరు జిల్లా కుక్కునూరు నుంచి తెలంగాణ సరిహద్దున ఉన్న బూర్గంపాడు వరకు వెళ్ళే రహదారి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించి, రహదారి అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని సీపీఐ నేతలు కోరారు. 36 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై అడుగడుగునా గుంతలు...వాటిపై వెళ్తే విరిగే నడుములు..పట్టపగలు వెళ్లాలంటేనే చుక్కలు కనిపించే పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధికి పూనుకుంది. కుక్కునూరు-బూర్గంపాడు మధ్య రహదారి నిర్మాణానికి నిధులు మాత్రం విదల్చలేదు. దీంతో రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయి. ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. కంకర..దుమ్ము ధూళితో నరకప్రాయంగా మారిన ఈ రహదారిని చూసి వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణం అంటే గమ్యస్థానం ఆసుపత్రే అన్నంత భయంకరంగా రహదారి ఉంది. ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుని వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. రహదారిపై ఏ కాస్త ఆదమరిచినా కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. ఇక గర్భిణులు ఆసుపత్రులకు వెళ్ళాలంటే ఏ క్షణం ఏమవుతుందోనని భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణికులతో పాటు రహదారి పక్కనే ఇళ్లల్లో ఉంటున్న ప్రజలు సైతం దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నారు. నిత్యం ప్రమాదాలతో వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. ఇంత దయనీయ స్థితిలో ఉన్న ఈ రహదారి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఐ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. నరక ప్రాయంగా మారిన ఈ రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి,మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి రమణయ్య, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబూరావు, పల్లాల భిక్షం, సోడే నాగేష్, మారయ్య , కనిత రాము, యాకుబ్ తదితరులు డిమాండ్ చేశారు.

అమిత్ షా గో బ్యాక్

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని పార్లమెంటు సాక్షిగా అవహేళనగా మాట్లాడుతూ వ్యంగ్యంగా అంబేద్కర్ అని జపిస్తే ఏమొస్తుంది దేవుడు తలిస్తే స్వర్గం ప్రాప్తి కలుగుతుందని వ్యాఖ్యలు చేసినటువంటి అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్ షా గో బ్యాక్ ఈ రాష్ట్రం నుంచి వెళ్లిపోమని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యురాలు డి రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి రమాదేవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అంబేద్కర్‌ను రోజు పూజించాలని, ఈ దేశం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయిపోతే రోజు దేవుడని పూజించొచ్చని, ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ దేశంలో బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాన్ని మార్గాన్ని చూపుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, ఆ రాజ్యాంగాన్ని నేడు పరిపాలన చేస్తున్నటువంటి బీజేపీ మతోన్మాద శక్తులు తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని నాశనం చేయాలని అంబేద్కర్‌కు ఉన్నటువంటి పేరుని ధ్వంసం చేయాలనేటువంటి ఉద్దేశంతోనే అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా ఈ రకమైన వ్యాఖ్యలు చేశారని తక్షణ అమిత్ షాను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలు కట్టబెడుతున్నారని, ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం తీవ్రతరం చేస్తున్నారని, రైతులు తమ గిట్టుబాటు ధరకు కల్పించాలని, ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహారం చేస్తుందని, ప్రజలందరూ ఈ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యురాలు టి నాగవరలక్ష్మి, నాయకులు పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి, సిహెచ్ సూర్యప్రకాశరావు, పి శ్రీనివాస్, టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

దస్తావేజులు పోయినవి

శ్రీమతి ఓదూరి సూర్యలక్ష్మి తులసి W/o రాంబాబు గారు ది. 06-11-2024 వ తేదీ నాడు పిఠాపురం, మెయిన్ రోడ్ లో గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ తీయించే నిమిత్తం వెళ్లగా ది.23-12-1985 సం॥ తేదీన కుక్కలూరి నారాయణమూర్తి వగైరా వద్ద క్రియం పొంది పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు దస్తావేజు నెం. 303/1985 క్రియ దస్తావేజు ఒరిజినల్ దారిలో పడిపోయినవని తెలుసుకుని వెతకగా కనిపించలేదని తెలియజేయుచున్నారు. కావున ఒరిజినల్ రిజిష్టర్ క్రియదస్తావేజు నెం. 303/1985 ఎవరికైనా దొరికినచో మా సంఘ సభ్యునికి గానీ, దిగువ అడ్రస్సులో గల మా సంఘమునకు గానీ, తెలియజేయవలెను. పాత సర్వే నెం. 359/8, 359/9 , కొత్త సర్వే నెం. 359/11 గల ఖాతా నెం. 1910 టైటిల్ డీడ్ నెం. 04219050473 మా సంఘం నందు రైతు నేస్తం అప్పు మంజూరు చేయుచున్నాము.

C.E.O.
ది చేబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, నెం. C.281. చేబ్రోలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : విద్యుత్ ప్రమాదాలు తరచూ జరుగుతున్నా ఆ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తూ చోద్యం చూస్తున్నారు తప్ప గ్రామాల్లో చిన్న చిన్న విద్యుత్ సమస్యలను తీర్చడానికి నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. కనీసం విద్యుత్ సర్వీస్ వైర్లు కిందికి వేలాడుతూ చేతికి అందుతున్నా పట్టించుకోకపోవడంతో అసలు విద్యుత్ శాఖ ఇక్కడ ఉందా అనిపిస్తోంది. మండల కేంద్రమైన కాట్రేనికోనలో టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఎదురుగా ఇంటికి వెళ్లే విద్యుత్ సర్వీస్ వైర్ కిందకు వేలాడుతూ పిల్లలకు సైతం తగులుతున్న విద్యుత్ సిబ్బంది పట్టించుకోరు. దీనిపై ఎన్నిసార్లు ఆ శాఖ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభం మీద నుంచి ఇంటికి వచ్చే సర్వీస్ వైరు బాగు చేయాలంటే విధిగా విద్యుత్ సిబ్బందే చేయాల్సి ఉంటుంది. ఇకనైనా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో

కియా ఈవీ6 ఆవిష్కరణ

రాజమండ్రి: కియా ఇండియా తన కొత్త ఈవీ 6ని ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఆవిష్కరిం చింది. ఈ ఎలక్ట్రిక్ వాహనం బుకింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు కంపెనీ ప్రకటించింది. ఈ వాహనం కియా ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణంలో మరో ముఖ్యమైన అడుగు. కొత్త కియా ఈ వీ 6 భద్రతలో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి గ్వాంగుజీలీ చెప్పారు. ఈ వాహనం కంపెనీ యొక్క ఆడాస్ 2.0 ప్యాకేజీతో అమర్చబడి ఉందని, ఇందులో 27 అధునాతన భద్రత డ్రైవర్ సహాయ లక్షణాలు ఉన్నాయన్నారు. మునుపటి మోడల్‌తో పోలిస్తే, దీనికి 5 కొత్త ఫీచర్లు జోడించబడ్డాయని, ఇది మరింత మెరుగ్గా ఉంటుందని. కొత్త కియా ఈ వీ 6 ఆధునాతన భద్రతా లక్షణాలతో వస్తుం దన్నారు. ఫ్రంట్ కొలిషన్ అవాయిడెన్స్ అసిస్ట్, ఫార్వర్డ్ కొలిషన్ అవాయిడెన్స్, జంక్షన్ క్రాసింగ్ లేన్ చేంజ్ అసిస్ట్‌తో, లేన్ ఫాలోయింగ్ అసిస్ట్, వాహనాన్ని లేన్‌లో ఉంచడానికి, ఎవాసివ్ స్టీరింగ్ అసిస్ట్, ఢీకొనకుండా ఉండటానికి. ఈ లక్షణాలన్నీ కంపెనీ ఫ్లాగ్‌షిప్ మోడల్ ఈ వీ 9 నుండి ప్రేరణ పొందాయన్నారు. ఢీకొన్నప్పుడు భద్రత, నిర్మాణ బలం మరియు ప్రయాణికుల రక్షణను మరింత మెరుగుపరుస్తాయన్నారు. కియా యొక్క ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ ఎస్ యూ వీ ఈ వీ9 ఆటోమోటివ్ పరిశ్రమలో సాంకేతికత ఆవిష్కరణల కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తోందని తెలిపారు.

థియేటర్లలో రెవెన్యూ అధికారుల పరిశీలన

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - జగ్గంపేట : థియేటర్ల లీజు యాజమాన్యాలు టిక్కెట్లను బ్లాక్ చేసి బయట విక్ర యిస్తున్నారని శనివారం విశా లాంధ్రలో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీ ల్దార్ జెవిఆర్ రమేష్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీని వాస్ ఆదివారం థియేటర్‌ను పరి శీలించారు. సంక్రాంతికి వస్తున్నాం ప్రదర్శిస్తున్న నాగేశ్వర, జీవియర్ థియేటర్లను పరిశీలించడం జరిగిం దని టిక్కెట్లను కౌంటర్‌లోనే రూ.250 చొప్పున విక్రయించడం జరిగిందని శ్రీనివాస్ విశాలాంధ్రకు తెలిపారు.

రామవరం మర్రిపాక రోడ్డుకు మోక్షం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రామవరం నుంచి మర్రిపాక వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో మోక్షం కలిగింది. హైవే నుంచి రామవరం పుష్కర కాలువ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు 335 మీటర్లు సిమెంట్ రోడ్డు, డ్రైన్లుకు రూ.84 లక్షలు ఎమ్మెల్యే నిధులు కేటాయించారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభించి కల్వర్టుకు సిమెంటు తూరలు వేయించే పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో కొన్ని సంవత్సరాల నుంచి ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మోక్షం కలిగిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.